## క్లుప్తంగా

### ముగిసిన స్వాతి నక్షత్ర వేడుకలు



శ్రీ కృష్ణుడి విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తున్న దృశ్యం

**బనగానపల్లె రూరల్:** పట్టణంలోని రవ్వలకొండపై వెలసిన శ్రీ చెంచు లక్ష్మీసమేత లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వాతి నక్షత్ర వేడుకలు సోమవారం ముగిశాయి. ఈ సందర్భంగా ఆలయ వ్యవస్థాపకులు బాలిశెట్టి పావన నరసింహమూర్తి ఆధ్వర్యంలో స్వామివారికి కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో శ్రీ కృష్ణుడి విగ్రహాన్ని శాస్త్రోక్తంగా ప్రతిష్ఠించి భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో భక్తులు గంగుల శేఖర్‌రెడ్డి, రాణెమ్మ, యామ సురేంద్రనాథ్‌రెడ్డి, మధు, ప్రదీప్, సుజాత తదితరులు పాల్గొన్నారు.

### ఆర్థిక సాయం



నగదు అందజేస్తున్న దృశ్యం

**డోన్ టౌన్ :** ఇటీవల విధులకు వెళ్లి కర్ణాటక రాష్ట్రం చింతామణిలో గుండెపోటుతో మృతి చెందిన లారీ డ్రైవర్ రామన్న కుటుంబానికి లారీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో రూ.50వేల నగదును సోమవారం అందజేశారు. వెల్దుర్తి మండలం ఎల్.నగరం గ్రామానికి చెందిన రామన్న లారీ డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఈ నేపథ్యంలో విధి నిర్వహణలో ఉండగా గుండెపోటుకు గురై మృతిచెందాడు. యూనియన్ ఆధ్వర్యంలో తోటి కార్మికులు, లారీ యజమాని కలిసి ఆర్థిక సహాయాన్ని స్థానిక యూనియన్ కార్యాలయంలో సోమవారం మృతుని భార్య రాధమ్మకు అందించారు. కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి శివరామ్, లారీ యజమాని మాబు, కార్మికులు ఉన్నారు.

### పారిశుద్ధ్య సిబ్బందికి దుస్తుల పంపిణీ



పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులు అందజేస్తున్న దృశ్యం

**బేతంచెర్ల :** స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో సోమవారం కమిషనర్ రమేష్ బాబు ఆధ్వర్యంలో చైర్మన్ చలం రెడ్డి చేతుల మీదుగా 80 మంది పారిశుద్ధ్య, తాగునీటి సరఫరా సిబ్బందికి రెండు జతల నూతన దుస్తులు, కొబ్బరి నూనె, సబ్బులు పంపిణీ చేశారు. చైర్మన్ మాట్లాడుతూ దసరా పండుగను పురస్కరించుకొని వీటిని అందజేసినట్లు తెలిపారు. నగర పంచాయతీలోని కాలనీలు పారిశుద్ధ్య కార్మికుల తోడ్పాటుతోనే పరిశుభ్రంగా ఉన్నాయన్నారు. పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యత అన్నారు. కార్యక్రమంలో నగర పంచాయతీ వైస్ చైర్మన్ నాగ వెంకటేశ్వర్లు, వార్డు కౌన్సిలర్లు ఆదిలక్ష్మి, అంజి, ఎల్లయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు దస్తగిరి, నిరంజన్, సలీమ్ పాల్గొన్నారు.

### భ్రమరాంబకు వెండి కవచం బహూకరణ



వెండి కవచంలో అమ్మవారు

**కొలిమిగుండ్ల:** మండల పరిధిలోని బందార్లపల్లె సమీపంలోని పురాతన నేల బెలుం మల్లేశ్వరస్వామి ఆలయంలో వెలసిన భ్రమరాంబకు అనంతపురం జిల్లా తాడిపత్రి పట్టణానికి చెందిన అంబటి గోపాల్‌రెడ్డి రూ.1.50 లక్షల విలువ గల వెండి కవచాన్ని బహూకరించారు. సోమవారం విశేష పూజలు నిర్వహించిన అనంతరం అమ్మవారికి వెండితో తయారు చేయించిన కవచంతో అలంకరించడంతో కొత్త శోభ సంతరించుకుంది. అలాగే నంద్యాల, అనంతపురం మహీంద్రా ట్రాక్టర్స్ షోరూం యజమానులు బాచం నాగేశ్వరరెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, వీరభద్రారెడ్డి కుటుంబ సభ్యులు నేల బెలుం మల్లేశ్వరస్వామికి రూ.లక్షల విలువగల వెండితో తయారు చేసిన ధారాపాత్ర, శఠగోపాన్ని ఆలయ పూజారి రవిస్వామికి అందజేశారు.

### వీఆర్‌ఓపై చర్యలు తీసుకోవాలి

**డోన్ రూరల్ :** మామూళ్లు తీసుకొని చనుగొండ్ల రైతుల అనుభవంలో ఉన్న పొలాలను వేరే వారి పేరుమీద ఆన్‌లైన్ చేసిన వీఆర్‌ఓపై చర్యలు తీసుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.రామాంజినేయులు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ఆర్‌డీఓ కార్యాలయం ఎదుట సీపీఐ పట్టణ కార్యదర్శి నారాయణ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతుల పొలాలను వేరేవారి పేరుపై ఎక్కించడమే కాకుండా, తమ పొలాలను ఆన్‌లైన్ చేయాలని రైతులు పలుమార్లు ఆర్డీఓ కార్యాలయం చుట్టూ తిరిగినా పట్టించుకోలేదన్నారు. అధికారులు స్పందించి బాధిత రైతులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి పులిశేఖర్, సహాయ కార్యదర్శి హుసేన్, కేశన్న, రైతులు మద్దిలేటి, గోరంట్ల శేఖర్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# రెండు నెలల్లో పనులన్నీ పూర్తి చేయాలి

- రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి
- పట్టణంలో సుడిగాలి పర్యటన
- పలు అభివృద్ధి పనుల పరిశీలన

**డోన్ :** పట్టణంలో చేపట్టిన అభివృద్ధి పనులన్నీ రెండు నెలల్లో పూర్తి చేయాలని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి కాంట్రాక్టర్లను ఆదేశించారు. సోమవారం పట్టణంలో రెండు అర్బన్ హెల్త్ సెంటర్లను ప్రారంభించిన అనంతరం పట్టణంలో సుడిగాలి పర్యటన చేశారు. మునిసిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, వైస్ చైర్మన్ జాకీర్ హుసేన్, కౌన్సిలర్లతో కలిసి అభివృద్ధి పనులను పరిశీలించారు. రూ.16కోట్లతో నిర్మిస్తున్న కూరగాయల మార్కెట్ పనులను మరింత వేగవంతం చేయాలన్నారు. వినియోగదారులు సులువుగా రాకపోకలు సాగించేందుకు మార్కెట్ చుట్టూ రహదారి, డ్రైనేజీ సౌకర్యం కల్పించాలన్నారు. ప్రతి రోజూ వేస్టేజ్ కూరగాయలను వాహనాల్లో బయటకు తరలించేందుకు రోడ్డు వెడల్పుగా ఉండేలా చేసుకోవాలని సూచించారు. అనంతరం రైల్వేస్టేషన్ రోడ్డులో రూ.3కోట్లతో నిర్మిస్తున్న క్లబ్ హౌస్ నిర్మాణం పనులను మంత్రి బుగ్గన పరిశీలించి పనుల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. క్లబ్‌హౌస్ నిర్మాణం పూర్తయితే మినీ పార్కుతో పాటు స్నూకర్, టెన్నిస్ కోర్టులను కూడా ఏర్పాటు చేస్తామన్నారు. నూతన మునిసిపల్ భవనం ఆవరణలో పార్కును అభివృద్ధి చేయాలని మునిసిపల్ చైర్మన్ రాజేష్‌కు సూచించారు.

**నగరవనాన్ని మరింత అభివృద్ధి చేయాలి**

మండలంలోని ఎర్రగుంట్ల వద్ద నిర్మించిన నగరవనాన్ని మంత్రి బుగ్గన సందర్శించారు. అటవీశాఖ అధికారులతో కలిసి పార్కు అంతా కలియతిరిగారు. పర్యాటకులను ఆకర్షించేందుకు నగరవనంలో క్యాంటీన్, మరుగుదొడ్లు, మంచినీటి సౌకర్యం కల్పించాలన్నారు. పార్కును మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దేందుకు జంతువుల బొమ్మలను ఏర్పాటు చేయడంతో పాటు అక్కడక్కడ సందర్శకులు సేదతీరేందుకు షెలర్లు కూడా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మంత్రి వెంట రాష్ట్ర మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు, గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ చిన్నకేశవయ్యగౌడ్, ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ బద్దల రాజ్‌కుమార్, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ మల్లెంపల్లె రామచంద్రుడు, రాష్ట్ర బీసీ సంఘం కార్యదర్శి భాస్కర్‌నాయుడు, పార్టీ నంద్యాల జిల్లా బీసీ విభాగం అధ్యక్షుడు పోస్టుపసాద్, కౌన్సిలర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

**ఆర్టీసీ బస్టాండ్ పరిశీలన**

**డోన్ టౌన్ :** రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి సోమవారం సాయంత్రం పట్టణంలోని కొత్త బస్టాండ్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలిస్తూ బస్టాండ్‌లో సౌకర్యాల గురించి డిపో మేనేజర్ శశిభూషణ్‌ను అడిగి తెలుసుకున్నారు. అలాగే ప్రభుత్వ ఐటీఐను సందర్శించి అక్కడి నిర్మాణాలు, భవనాలు, కేంద్రీయ విద్యాలయం కోసం సిద్ధం చేస్తున్న భవనాల పురోగతిపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఆర్యవైశ్యుల ఆహ్వానంతో పట్టణంలోని పాతపేట అమ్మవారిశాలకు వెళ్లి దసరా నవ రాత్రుల సందర్భంగా శ్రీశాకాంబరిదేవీ రూపంలో ప్రత్యేకంగా అలంకరించిన అమ్మవారిని దర్శించుకొని, ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.



డోన్ క్లబ్‌హౌస్ పనులను పరిశీలిస్తున్న మంత్రి బుగ్గన



అమ్మవారిశాలలో పూజల్లో పాల్గొన్న మంత్రి బుగ్గన

- **మద్దిలేటయ్య క్షేత్రాభివృద్ధికి కృషి**

**బేతంచెర్ల:** వైష్ణవ పుణ్యక్షేత్రమైన శ్రీ మద్దిలేటి నరసింహస్వామి క్షేత్రాన్ని ఆధ్యాత్మికంగా, పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్నట్లు ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆర్‌ఎస్ రంగాపురం గ్రామంలోని మద్దిలేటిస్వామి ఆలయ ముఖ ద్వారం వద్ద నూతనంగా రూ.2.75 కోట్లతో గ్రానైట్‌తో నిర్మించే ఆలయ ముఖద్వారానికి సంబంధించిన పనులను మంత్రి బుగ్గన పరిశీలించారు. ఆలయంలో రూ.12.70 కోట్లతో నిర్మించనున్న మహా ప్రకార మండప నిర్మాణం, స్వామి వారి పాద మండపం, గోపురంతో సహా రూ. 40 కోట్లతో చేపట్టిన ఆలయ పునర్నిర్మాణ పనులపై ఆలయ ఈఓ పాండు రంగారెడ్డి, చైర్మన్ రామచంద్రుడు, కాంట్రాక్టర్‌కు మంత్రి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. క్రమ పద్ధతిలో సాధ్యమైనంత త్వరగా పనులు పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. మంత్రి వెంట తహసీల్దార్ నరేంద్రనాథ్ రెడ్డి, ఆర్‌అండ్‌బీ డీఈ ప్రసాద్‌రెడ్డి, ఏఈ మునిస్వామి, ఆలయ పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

### నేడు గార్లదిన్నె, మునిమడుగు రోడ్ల ప్రారంభోత్సవం

**ప్యాపిలి:** మండల పరిధిలోని గార్లదిన్నె–అలేబాదు, మునిమడుగు–అలేబాదుతండా రోడ్లను ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి మంగళవారం ప్రారంభించనున్నట్లు వైఎస్సార్‌సీపీ వర్గాలు సోమవారం ఒక ప్రకటనలో తెలిపాయి. గార్లదిన్నె నుంచి అలేబాదు వరకు పీఆర్‌ఆర్ ప్లెయిన్ నిధులు రూ. 3 కోట్లతో 4 కిలోమీటర్ల మేర కొత్తగా రోడ్డును వేశారు. మునిమడుగు నుంచి అలేబాదు తండా వరకు 5 కిలోమీటర్ల మేర రూ. 2.5 కోట్లు పీఆర్‌ఆర్‌ఎస్టీసీ నిధులతో కొత్త రోడ్డు వేశారు. మంత్రి ఉదయం 9 గంటలకు మునిమడుగు గ్రామానికి చేరుకుని శిలాఫలకాన్ని ఆవిష్కరించి రోడ్డుకు ప్రారంభోత్సవం చేస్తారని పేర్కొన్నారు. అక్కడి నుంచి అలేబాదు వరకు మంత్రి పాదయాత్ర చేస్తారని వెల్లడించారు.

### వినియోగదారులకు నాణ్యమైన సేవలందించాలి

**బనగానపల్లె రూరల్:** వినియోగదారులకు నాణ్యమైన వస్తు సేవలందించి ప్రజల మన్ననలను పొందాలని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి అన్నారు. సోమవారం స్థానిక ఎల్‌ఐసీ కార్యాలయం సమీపంలో వందే మార్ట్ (సూపర్ మార్కెట్)ను ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.

### సారా విక్రేతల అరెస్టు

**బేతంచెర్ల :** పట్టణంలోని దుర్గాపేట, నంద్యాల రహదారిలో నాటుసారా విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు దాడులు నిర్వహించినట్లు ఎస్‌ఐ శివ శంకర్ నాయక్ తెలిపారు. ఈ దాడుల్లో తాళ్లూరి లింగేష్ దగ్గర 10 లీటర్లు, కేశన్న గౌడ్, శ్రీనివాసులు నాయక్ వద్ద 10 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

## కనుల పండువగా వేంకటేశ్వరస్వామి కల్యాణం

**బేతంచెర్ల:** పట్టణంలోని చెన్న కేశవస్వామి ఆలయంలో వెలసిన అలివేలుమంగ, పద్మావతీ దేవి సమేత వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని సోమవారం కల్యాణోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో ఉదయం స్వామి అమ్మవార్లకు అభిషేకం కుంకుమార్చన, మహామంగళహారతి, గణపతిపూజ, పుణ్యాహవాచనం 11:55 గంటలకు అభిజిత్ లగ్నంలో భక్త జనసందోహం, వేదపండితుల మంత్రాల మధ్య కల్యాణం కమనీయంగా జరిగింది. స్వామి, అమ్మవార్లకు గుండా అశ్వర్థనారాయణ, హిమ బిందు, ప్రకాశ్‌బాబు, లక్ష్మి సువర్ణ దంపతులు కల్యాణ తంతు జరిపించారు. అనంతరం దాతల సహకారంతో భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ మద్దిలేటి, గ్రూపు దేవాలయాల మాజీ చైర్మన్ గుండా జగన్‌మోహన్ రావు, బ్రహ్మోత్సవాల కమిటీ సభ్యులు శ్రీధర్‌రెడ్డి, గుండాగోపాలు, గౌరి హుసేన్‌రెడ్డి, బుగ్గన విశ్వనాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

## ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సురక్షితం

**డోన్ టౌన్ :** ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సురక్షితమని డిపో మేనేజర్ శశిభూషణ్ అన్నారు. ప్రయాణికులను ప్రోత్సహించేందుకు ఆర్టీసీ వారు ప్రవేశ పెట్టిన లక్కీ డిప్ స్కీంకు సంబంధించి సోమవారం ప్రజల సమక్షంలో డిప్ తీసి, విజేతలకు బహుమతులను అందజేశారు. అక్టోబరు నెల 15వ తేదీ వరకు డోన్, కర్నూలు రూట్‌కు సంబంధించి లక్కీ డిప్ తీశారు. డోన్ పట్టణానికి చెందిన శకుంతలకు మొదటి బహుమతి, ద్వితీయ బహుమతి శ్రీదేవి, వెల్దుర్తికి చెందిన దేవసుందరంకు మూడో బహుమతి అందజేశారు. డోన్, కర్నూలు పల్లె వెలుగు సర్వీసుల్లో ప్రయాణించిన వారు టికెట్ వెనుక తమ పేరు, ఫోన్ నంబర్, అడ్రస్ తదితర వివరాలను రాసి బస్సులో ఏర్పాటు చేసిన బాక్సులో వేయాలన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న డీఎం

## ప్రతి గడపకూ సంక్షేమం

- ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి
- అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు
- గుండ్లశింగవరంలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

**అవుకు:** ప్రతి గడపకూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందజేయడమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి అన్నారు. మండలంలోని గుండ్లశింగవరం గ్రామంలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే స్వగ్రామం కావడంతో ముందుగా గ్రామానికి చేరుకున్న ఆయనకు గ్రామస్తులు పూలమాలలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం సర్పంచ్ కాటసాని రమాకాంత్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ యువ నాయకులు కాటసాని ఓబుల రెడ్డి, నాయకులు కాటసాని ప్రసాద్ రెడ్డి, అవుకు మండల కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డి, ప్రచార కార్యదర్శి సిద్ధం రెడ్డి రామ్మోహన్ రెడ్డి, మండల స్థాయి అధికారులతో కలిసి విస్తృతంగా పర్యటించారు. గడప గడపకు వెళ్లి అమ్మా బాగున్నావా.. అక్కా బాగున్నావా, వదినా బాగున్నావా.. సంక్షేమ పథకాలు అందుతున్నాయా?.. అంటూ ఆప్యాయంగా పలకరిస్తూ ముందుకు సాగారు. ప్రతి ఇంటి వద్ద ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తూ, ఆయా కుటుంబాలకు ప్రభుత్వం నుంచి వర్తించిన సంక్షేమ పథకాల వివరాల బ్రోచర్‌ను అందజేశారు. అదేవిధంగా అక్కడి సమస్యలపై ఆరా తీశారు.

**గ్రామంలో 4.80 కోట్లతో అభివృద్ధి**

గుండ్లశింగవరం గ్రామం నేను పుట్టిన ఊరని, ఈ గ్రామానికి నేను ఎంత చేసినా తక్కువేనని ఎమ్మెల్యే అన్నారు. గ్రామాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. గ్రామ అభివృద్ధి కొరకు ఇప్పటి వరకు రూ.4.80 కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. అలాగే జరిగిన నాలుగేళ్ల పాలనలో ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా గ్రామ పరిధిలోని ప్రజలు రూ.8.83 కోట్లు లబ్ధి పొందారన్నారు.

**సమస్యలు పరిష్కరించేందుకే..**

అర్హులైన పేదలు సంక్షేమ పథకాలకు దూరం కాకూడదన్నదే ముఖ్యమంత్రి ఉద్దేశమని, ఈ మేరకు ప్రజలను నేరుగా కలుసుకొని సమస్యలను తెలుసుకొని పరిష్కరించేందుకే మీ ముందుకు వచ్చామన్నారు. ఇలాంటి కార్యక్రమం ఇంతవరకు ఏ సీఎం చేపట్టలేదన్నారు. సంక్షేమ పాలన కొనసాగించేందుకు మరోమారు వైఎస్సార్‌సీపీని ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటేశ్వరరెడ్డి, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఉమ్మడి కర్నూలు జిల్లా ఎంపీటీసీల సంఘం అధ్యక్షుడు గోపవరం గోపాల్ రెడ్డి, ఉపసర్పంచ్ గడ్డం ఆదినారాయణ రెడ్డి, నాయకులు ఉమ్మడి పెద్ద మునిరెడ్డి, కాటసాని అంకాల్ రెడ్డి, కాటసాని శివారెడ్డి, లక్ష్మీనారాయణ రెడ్డి, పెద్ద దస్తగిరి రెడ్డి, నారెడ్డి చిన్న ఈశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మహిళకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

**శరన్నవరాత్రి ఉత్సవాలకు ఆహ్వానం**

**బనగానపల్లె రూరల్ :** అవుకు మండల కేంద్రంలో జరుగుతున్న దసరా శరన్నవరాత్రి మహోత్సవాల్లో పాల్గొనాలని మండల ఆర్యవైశ్య సంఘం నాయకులు ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డిని కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. సోమవారం సాయంత్రం స్థానిక ఎమ్మెల్యే స్వగృహంలో ఎమ్మెల్యేతో పాటు ఆయన సోదరుడు కాటసాని తిరుపాల్‌రెడ్డికి పూలమాల, దుశ్శాలువా వేసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అవుకు మండల ఆర్యవైశ్య సంఘం నాయకులు మేడం ఆంజనేయులు, పల్లం నాగభూషణం, మల్లెల సునీల్‌కుమార్, తాలేపల్లి నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాసంక్షేమంతో పాటు అభివృద్ధికి పెద్ద పీట

**బేతంచెర్ల:** సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజాసంక్షేమంతో పాటు అభివృద్ధికి పెద్ద పీట వేశారని ఎంపీపీ బుగ్గన నాగభూషణంరెడ్డి అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ దస్తగిరి బాబు ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా శాఖల అధికారులు తమ నివేదికలను వెల్లడించారు. ఎంపీపీ మాట్లాడుతూ.. మండల ప్రజలు, ప్రజా ప్రతినిధులు, అధికారుల సమన్వయంతో ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి సహకారంతో విద్య, వైద్యరంగాలతో పాటు గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దుతామన్నారు. అర్హులైన వారందరికి సంక్షేమ పథకాలు అందేలా చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఎక్కడైనా బోరు బావులు మరమ్మతులకు గురైనా, పైపు లైన్లు లీకేజీలున్నా యుద్ధ ప్రాతిపాదికన పనులు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ శ్రీలక్ష్మి, ఏపీఓ శేషన్న, వైస్ ఎంపీపీ వెంకట సుబ్బమ్మ, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి

### మద్దిలేటిస్వామి ఆలయానికి 46 కేజీల వెండి విరాళం

**బేతంచెర్ల :** మండలపరిధిలోని ప్రముఖ వైష్ణవ పుణ్యక్షేత్రమైన శ్రీ మద్దిలేటి నరసింహ స్వామి గర్భాలయ ద్వారానికి వెండి తోరణం కోసం 46కేజీల 703 గ్రాముల వెండిని ఆళ్లగడ్డ పట్టణానికి చెందిన మద్దిలేటి రెడ్డి కుటుంబ సభ్యులు సోమవారం అందజేశారు. ఆలయ ఈఓ పాండు రంగారెడ్డి, చైర్మన్ రామచంద్రుడు ఆధ్వర్యంలో దాతలకు స్వామి, అమ్మవార్ల ప్రత్యేక పూజల అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేసి, స్వామి వారి పట్టు వస్త్రంతో సత్క రించారు. కార్యక్రమంలో పాలక మండలి సభ్యు లు లక్ష్మీనాయుడు, వెంగల రెడ్డి, రమణ, రామచంద్రుడు, కృష్ణారెడ్డి, ఈశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వెండిని అందజేస్తున్న దాతలు

### ప్రతి ఒక్కరికీ సంపూర్ణ ఆరోగ్యం

**బనగానపల్లె :** మండలంలోని ఎర్రగుడి గ్రామంలో ఎంపీడీఓ శివరామయ్య అధ్యక్షతన సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం జరిగింది. ఈ శిబిరానికి విశేష స్పందన లభించింది. వైద్య శిబిరంలో వైద్యులు శివశంకరుడు, ఫిరోజ్, శైలజ, సోహెల్‌బాబు, మంగ్యా నాయక్ 602 రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు ఇచ్చారు. కార్యక్రమంలో ఎంఈహెచ్‌ఈఓ సుబ్బరాయుడు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

**504 మందికి వైద్య పరీక్షలు..**

**అవుకు:** మండల పరిధిలోని రామాపురం–2లో సోమవారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంప్‌లో డాక్టర్లు యమునా, ఇందిరా కళ్యాణి, డెర్మటాలజిస్ట్ జనార్దన్, ఈఎన్‌టీ చిన్నలింగన్నలు 504 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. డిప్యూటీ తహసీల్దార్ పోతుల ప్రసాద్ బాబు ఆధ్వర్యంలో నిర్వహించిన మెడికల్ క్యాంప్‌నకు ప్రజల నుంచి విశేష స్పందన వచ్చింది. ఎంపీటీసీ పేరం వెంకటసుబ్బారెడ్డి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

**ప్యాపిలి:** ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ చంద్రశేఖర్ వర్మ, ఈఓఆర్డీ బాలకృష్ణుడు తెలిపారు. మండల పరిధిలోని రాచర్ల గ్రామంలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని నిర్వహించారు. దాదాపు 508 మందికి ఈ శిబిరంలో వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైద్యాధికారులు వాణిశ్రీ, నుస్రత్ ఉ జోహరా, సహృదయ్, ప్రసాద్ నాయక్ తదితరులు వైద్య సేవలు అందించారు.

**డోన్ రూరల్ :** పేదలకు ఇంటి వద్దే వైద్యం అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం జగన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంప్‌లను ఏర్పాటు చేసిందని, ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కమలాపురం సర్పంచ్ అర్జున్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని కమలాపురం గ్రామంలో సోమవారం ఎంపీడీఓ శ్రీనివాసులు ఆధ్వర్యంలో నిర్వహించిన జగన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అర్జున్‌రెడ్డి పరిశీలించారు. కార్యక్రమంలో కన్నపకుంట గ్రామ సర్పంచ్ కళ్యాణి, డీలర్ రామకృష్ణారెడ్డి, డాక్టర్లు అనితారెడ్డి, లఖిల్, వైద్య సిబ్బంది ప్రభాకర్, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.



ఎర్రగుడిలో రోగులకు పరీక్ష నిర్వహిస్తున్న మెడికల్ ఆఫీసర్ శివశంకరుడు

## ఉమామహేశ్వర స్వామికి పల్లకీ సేవ

**బనగానపల్లె రూరల్ :** మండలంలోని యాగంటి క్షేత్రంలో వెలసిన శ్రీ ఉమామహేశ్వర స్వామి ఆలయంలో సోమవారం పల్లకీ సేవను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి, ఆలయ పాలక మండలి చైర్మన్ తొట బుచ్చిరెడ్డిల ఆధ్వర్యంలో ఆలయంలో ఏకశిలా రూపంలో కొలువైన శివపార్వతులకు అభిషేకం, అర్చన తదితర పూజలు చేపట్టారు. సాయంత్రం స్వామివార్ల ఉత్సవ విగ్రహాలను పల్లకీలో కొలువుంచి ఊరేగించారు. కార్యక్రమంలో పాతపాడు సర్పంచ్ మహేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఎల్లకీ సేవ నిర్వహిస్తున్న దృశ్యం

### పంట నమోదు గడువు పెంచాలి

**డోన్ టౌన్ :** ఖరీఫ్ సీజన్‌లో రైతులు సాగు చేసిన పంటలను ఈ క్రాప్ బుకింగ్, ఈ–కేవైసీ చేసేందుకు గడువు పెంచాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏఈ నాగరాజు కోరారు. ఈ మేరకు సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసులను కలిసి వినతి పత్రం అందజేశారు.

### ఆ జీఓలను రద్దు చేయాలి

**డోన్ రూరల్ :** రాష్ట్ర ప్రభుత్వం ఆటో డ్రైవర్లపై అధికంగా చలానా వేస్తున్న జీఓ నంబర్ 21, 31లను వెంటనే రద్దు చేయాలని ఏఐటీయూసీ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి పి.సుంకయ్య డిమాండ్ చేశారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో సోమవారం డోన్ నియోజకవర్గ ఆటో వర్కర్స్ యూనియన్ జనరల్ బాడీ సమావేశాన్ని నియోజకవర్గ అధ్యక్ష కార్యదర్శులు అబ్బాస్, పుల్లయ్యల ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు అన్వర్, ఖాసిం, నారాయణ, హైఖేల్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

### వ్యక్తిపై దాడి

**డోన్ టౌన్ :** మద్యం మత్తులో ఇద్దరు యువకులు నాగరాజు అనే వ్యక్తిపై దాడి చేసి గాయపరిచిన ఘటన పట్టణంలో చోటు చేసుకుంది. చిగురమానుపేటకు చెందిన బాధితుడు ఆదివారం రాత్రి ఇంటికి వెళుతుండగా సంతోష్‌తో పాటు మరో యువకుడు అకారణంగా దాడి చేసి గాయపరచారు. ఈ దాడిలో నాగరాజు వీపుకు, ఎడమ చేతికి, భుజంపై బలమైన గాయాలు కావడంతో ఆసుపత్రికి వెళ్లి వైద్య చేయించుకొని, సోమవారం పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

### రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

**ప్యాపిలి:** స్థానిక బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన కీర్తి, వైశాలి అనే విద్యార్థినులు రాష్ట్రస్థాయిలో జరిగే ఈత పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం సరళా దేవి, పీడీ విజయలక్ష్మి సోమవారం తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఇటీవల జిల్లా కేంద్రంలో నిర్వహించిన అండర్ –14, అండర్ –17 విభాగాల్లో కీర్తి, వైశాలి ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి ఈత పోటీలకు ఎంపికయ్యారన్నారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులను హెచ్‌ఎం, పీడీ అభినందించారు.



విద్యార్థినులను అభినందిస్తున్న హెచ్‌ఎం, పీడీ



కోవెలకుంట్లలో అన్నపూర్ణాదేవి అలంకారం



గీతాశ్రమంలో గాయత్రీదేవి అలంకరణ



అవుకులో అన్నపూర్ణ దేవీ అలంకరణ



ప్యాపిలిలో బాలాత్రిపురసుందరీ దేవి



బేతంచెర్లలో పార్వతి దేవి అలంకారంలో వాసవీ మాత

## వాసవీమాత.. కటాక్షించు

**కోవెలకుంట్ల:** దసరా ఉత్సవాలను పురస్కరించుకుని పట్టణంలో వెలసిన వాసవీ కన్యకాపరమేశ్వరీ దేవి ఆలయంలో శరన్నవరాత్ర ఉత్సవాలు రెండవరోజుకు చేరుకున్నాయి. సోమవారం అమ్మవారు అన్నపూర్ణాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. పట్టణానికి చెందిన గురువయ్య, సుబ్బరత్నమ్మ, నాగభూషణం, వందన, సుబ్రమణ్యం, పద్మావతమ్మ దంపతులు పూజకు ఉభయదారులుగా వ్యవహరించారు. అలాగే స్థానిక అంకాలమ్మ చౌరస్తా, సరస్వతీ నగర్‌లో వెలసిన ఆలయాల్లో మారెమ్మ, సరస్వతీమాత అమ్మవార్లు గాయత్రీ దేవి అలంకారాల్లో భక్తులకు కనువిందు చేశారు.

**కొలిమిగుండ్ల:** అంకిరెడ్డిపల్లె గీతాశ్రమంలోని రాజరాజేశ్వరి అమ్మవారు గాయత్రీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. తిమ్మనాయినపేటలోని వాసవీ కన్యాకపరమేశ్వరి దేవి ఆలయంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**అవుకు:** మండల కేంద్రంలో వెలసిన శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీ దేవి సోమవారం అన్నపూర్ణ దేవీ అలంకరణలో దర్శనమిచ్చారు.

**డోన్ :** కొండపేటలో కౌన్సిలర్ టమటం దినేష్‌గౌడ్ ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహం రెండవరోజు గాయత్రి దేవి అలంకరణతో భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవ కమిటీ సభ్యులు సుబ్బారాయుడు, రమేష్‌రెడ్డి, రంగస్వామి, రవి, వెంకటేష్, రామ్‌నజి, వీరేష్‌లు భక్తులకు అన్నదాన వితరణ కార్యక్రమాన్ని చేపట్టారు.

**ప్యాపిలి:** పట్టణంలోని అంకాళ పరమేశ్వరి, దుర్గమ్మ, శ్రీమత్కన్యకా పరమేశ్వరి ఆలయాల్లో శరన్నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. స్థానిక శ్రీమత్కన్యకా పరమేశ్వరి ఆలయంలో సోమవారం వాసవీ మాత బాలాత్రిపురసుందరీ దేవి అలంకరణలో దర్శనమిచ్చారు. ఆర్వేటి లక్ష్మీనారాయణ, వెంకటలక్ష్మమ్మ దంపతులు, బైసాని మధుసూదన్, బైసాని చంద్రమోహన్ శాశ్వత ఉభయదాతలుగా వ్యవహరించారు.

**డోన్ టౌన్ :** దేవీ నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని స్థానిక శ్రీకనకదుర్గా మల్లేశ్వరి ఆలయంలో అమ్మవారిని సోమవారం శ్రీరాజరాజేశ్వరి దేవిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు.

**బేతంచెర్ల:** స్థానిక అమ్మవారిశాలలో వెలసిన వాసవీ మాత సోమవారం రాత్రి లింగార్చిత పార్వతి దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. వాసవీ మహిళా మండలి సభ్యులు వాసవీమాతను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. ఆర్యవైశ్య సంఘం గౌరవ అధ్యక్షులు గుండా గోపాల్, అధ్యక్ష, కార్యదర్శులు కందగడ్డల మోహన్, గురవయ్య పాల్గొన్నారు.